ప్రజాశక్తి





విలేకరులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం

నేటి నుంచి 30 గంటల సత్యాగ్రహ దీక్ష

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద 30 గంటల సత్యాగ్రహ దీక్షను బుధవారం ప్రారంభిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్న ఇళ్లు నిర్మించి ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు ఆచరణలో 10 శాతం కూడా అమలు కాలేదన్నారు. 90 రోజుల్లో ఇంటి స్థలం హామీ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు, పేదల కాలనీలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. జిల్లాలోని పేదలకు 68,288 ఇళ్లు మంజూరు అయినప్పటికీ, ఇప్పటికి పది వేల ఇళ్లు కూడా పూర్తి కాలేదన్నారు. గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఇస్తున్న రూ.1.50, రూ.1.80 లక్షలు ఏమూలకు సరిపోవడం లేదని చెప్పారు. ఈ సాయాన్ని పెంచాలని లబ్ధిదారులు వేడుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితుల్లో లేదన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో భూకబ్జాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్నారు. కొద్ధిమంది రెవెన్యూ అధికారుల అండతో అధికార పార్టీ నాయకులు కోట్ల విలువైన స్థలాలను ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. గుత్తి, అనంతపురం మండలం రాజీవ్‌కాలనీ, కొడిమి, ఉప్పరపల్లిలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం వెనుక ప్రముఖుల హస్తం ఉందన్నారు.


నేడు 30 గంటల సత్యగ్రహం

హాజరుకానున్న వి.శ్రీనివాసరావు

పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో డిసెంబర్ నెల చివరి వారంలో గుత్తి నుంచి అనంతపురం కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించామన్నారు. జనవరి నెలలో మూడు ఆర్డీవో కార్యాలయాల వద్ద ఆందోళనలు చేశామని గుర్తు చేశారు. అయినా అధికారుల్లో చలనం లేకపోవడంతో ఫిబ్రవరి 1,2వ తేదీల్లో కలెక్టర్ కార్యాలయం వద్ద 30 గంటల సత్యగ్రహం దీక్షను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై దీక్షను ప్రారంభిస్తారని చెప్పారు. పేదలు, ప్రజలు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

నిర్మలమ్మ.. ఇటు చూడమ్మ..!

కేంద్ర ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బుధవారం నాడు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏ మేరకు ప్రాధాన్యత లభిస్తుందోనని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. గడచిన కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి చెప్పకోదగ్గ కేటాయింపులూ చేయలేదు. జిల్లా వాసులు ప్రతిసారీ బడ్జెట్‌పై ఆశలు పెట్టుకోవడం తరువాత ఉసూరుమనడం పరిపాటి అయ్యింది. ఈ సారైనా కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు న్యాయం చేసేలా కేటాయింపులు ఉండాలని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు.



- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి 'అనంత'కు చోటు లభించేనా.?
- విభజన హామీల అమలు అంతంత మాత్రమే
- రైల్వేకు నిధులూ అరకొరే
- కేటాయింపులపై సర్వత్రా ఆసక్తి



2022లో నాసిన్‌కు సంబంధించి 2వ సారి భూమిపూజ చేసిన పనులు ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి నిర్మాలా సీతారామన్(ఫైల్‌ఫొటో)



గుంతకల్లు రైల్వేజంక్షన్ పోలీసు స్టేషన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర విభజన అనంతరం కేంద్రం అనేక హామీలను ఇచ్చింది. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి అనేక వాటికి నిధులను మంజూరు చేయాల్సి ఉంది. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభివృద్ధికి సంబంధించి కేటాయింపులు నిరాశనే మిగులుస్తూ వస్తున్నాయి. రైల్వే, విభజన హామీల అమలు దేనికైనా ఇదే రకంగా ఉంటున్నాయి. రాష్ట్ర విభజన జరిగి దశబ్ధకాలం పూర్తవుతున్నా విభజన హామీల అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

విభజన హామీలు

విభజన హామీల్లో ఒకటైన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటై ఐదేళ్లు కావస్తున్నా పూర్తి స్థాయిలో ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికీ శాశ్వత భవనాలే లేవు. తాత్కాలిక భవనాలు, అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు కనీసం వసతి గృహ సౌకర్యం కూడా సరిగా లేదు. విద్యార్థులు తరచూ ఈ సమస్యలపై ఆందోళనలు వ్యక్తం చేయడం పరిపాటిగానే మారుతోంది. బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద స్థల కేటాయింపులు జరిగినా శాశ్వత భవన నిర్మాణాలకు నిధుల కేటాయింంపులు ఆశించినంత జరగలేదు. కేటాయింపులు జరిగినా నిధులు మంజూరవలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లోనైనా కేంద్రీయ విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయిలో నిధుల కేటాయింపులు జరుగుతాయా.? లేక ఎప్పటిలాగానే మొక్కుబడి నిధుల కేటాయింపులే జరుగుతాయా.? అన్నది చూడాల్సి ఉంది. ఇక నాసన్ సంస్థకు 2015లోనే శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభమవలేదు. తాజాగా 2022లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ వచ్చి శంకుస్థాపన చేశాక పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాదికైనా దీని నిర్మాణ పనులు పూర్తి స్థాయి అవుతాయా.? లేదా.? అన్నది చూడాల్సి ఉంది. మరో సంస్థ 'బెల్'కు 2015 సెప్టంబరులో శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఇది ప్రహరీ నిర్మాణానికే పరిమితమైంది. ఈ ఏడాది ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. కాని పూర్తి స్థాయి పనులు ఎప్పటికి ప్రారంభం అవుతాయో తెలియని పరిస్థితి ఉంది.

రైల్వే నిధుల కేటాయింపులు పెరిగేనా.?

ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ప్రాధాన్యత కలిగిన గుంతకల్లు డివిజన్ అనంతపురం జిల్లాలోని గుంతకల్లులో ఉంది. ఇటు ఉత్తర భారతానికి, ఇటు దక్షిణ భారతదేశానికి కలిపే కీలకమైన డివిజన్ గుంతకల్లు. ఈ డివిజన్‌కు నిధుల కేటాయింపులు మొదటి నుంచి అరకొరగానే ఉంటున్నాయి. గత కొన్నేళ్లుగా కొత్త రైలు ఒక్కటీ దీని పరిధిలో వేయలేదు. ప్రకటిచిన రైల్వేలైన్లే దశాబ్ధాలుగా నడుస్తూనే ఉన్నాయి. రాయదుర్గం-తుంకురు, కడప-బెంగళూరు, డోన్-గుంటూరు డబ్లింగ్ ఇలా అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. వీటికి ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయింపులు పెంచి పనులు పరుగులు పెట్టిస్తారా.? లేక ఎప్పటిలాగానే అరకొర కేటాయింపులతో నత్తనడకన నడిపిస్తారా అన్నది చూడాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా వాసులు మాత్రం ఈ సారైనా కేంద్రం నిధుల విడుదలలో కనికరం చూపకపోతుందా అని గంపెడాసతో ఎదురుచూస్తున్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా పూర్తిగా నివారించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర బాలికల సాధికారత, బాల్యవివాహాల నివారణ కార్యక్రమంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో మొబైల్ వాడకం, యుక్తవయసు విద్యార్థులపై చూపుతున్న దుష్ప్రభావాలు, జోగిని-బసివినిల సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలు, పోక్సో కేసు బాధితుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక కారణాల దష్ట్యా బాల్య వివాహాలను అపడం, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం వరకే అధికారులు బాధ్యతగా నిర్వహిస్తున్నారని, ఇదే అదనుగా కొందరు కొన్ని రోజుల తర్వాత ఇతర రాష్ట్రాలకు వెళ్లి గుట్టు చప్పుడు కాకుండా పెళ్లిళ్లు జరిపిస్తున్నారన్నారు. కర్నాటక సరిహద్దు ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తున్న ఈ సంప్రదాయంపై ఉక్కుపాదం మోపాలన్నారు. బాల్య వివాహాలు నిర్వహించే తల్లిదండ్రులపై బైండోవర్ కేసులు, క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.

విద్యాలయాల్లో మాదకద్రవ్యాలను నివారిద్దాం

పాఠశాలలు, కళాశాలల పరిధిలో మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం ఉండకుండా, పూర్తిగా నివారిద్దామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణ, పిల్లలను మత్తు పదార్థాలకు దూరం చేసే కార్యక్రమం అమలుపై జిల్లాస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, మద్యం షాపులు, మెడికల్ షాపులలో సీసీటీవీలు అమర్చి, 18 ఏళ్ల వయసు లోపు వారిలో మత్తు పదార్థాల వినియోగాన్ని పర్యవేక్షించాలన్నారు. మైనర్లలో మత్తు పదార్థాల ప్రభావంపై పిల్లలతో పాటూ తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సిడబ్ల్యూసి ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి, డిఎంహెచ్ఒ డాక్టర్ వీరబ్బాయి, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి, బాలల పరిరక్షణ అధికారి సుబ్రమణ్యం, డిఇఒ కష్ణయ్య, పిఒఎస్ఎస్ఎ తిలక్ విద్యాసాగర్, డివిఇఒ వెంకటరమణ నాయక్, ఆర్ఐఒ సురేష్ బాబుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



డిఐజికి వినతిపత్రం అందిస్తున్న కెవిపిఎస్, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సంరక్షించండి

డిఐజిని కోరిన కెవిపిఎస్, ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాలు

అనంతపురం కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలులో జిల్లా పోలీసులపై నమ్మకం లేదని, మీరైనా చట్టాన్ని సంరక్షించాలని డిఐజి రవిప్రకాష్‌ను ప్రజా సంఘాల నాయకులు కోరారు. మంగళవారం డిఐజి కార్యాలయంలో కెపిపిఎస్, దళిత, గిరిజన సంఘాల నాయకులు ఓ.నల్లప్ప, దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు నెరమెట్ల ఎల్లన్న, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ తిరుపాల్, బాల పెద్దన్న, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శంకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు చిన్న పెద్దన్న, గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ హాజరై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దళిత, గిరిజనులపై దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. రక్షణగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సమగ్రంగా అమలు చేసి దళిత, గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చిన్న ఆంజనేయులు, గోవిందు, వెంకటాపురం చంద్ర, కెవిపిఎస్ జిల్లా నాయకులు మల్లెల ఎర్రిస్వామి, నరసింహులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడలో ఆదర్శ కళాశాల విద్యార్థిని ప్రతిభ

గుత్తి : పట్టణంలోని ఎపి ఆదర్శ కళాశాల చెందిన విద్యార్థిని మమత అండర్ 19 ఫుట్‌బాల్ క్రీడలో ప్రతిభ చాటింది. కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న మమత తిరుపతిలో జరిగిన అండర్ 19 రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ క్రీడలో రాణించింది. జాతీయస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైంది. దీంతో మంగళవారం ఏపీ ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఉష, ఉపాధ్యాయులు సిబ్బంది మమతను అభినందించారు.

కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ

- కార్మిక, కర్షకుల రక్షణకు మరో స్వాతంత్య్ర పోరాటం చేద్దాం
- ఏప్రిల్ 5న చలో ఢిల్లీకి తరలిరండి
- రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు




సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక, వ్యవసాయ కౌలు రైతుల వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు విమర్శించారు. కార్మిక, కర్షక, వ్యవసాయ, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ సన్నాహక సదస్సును మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. సిఐటియు, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల అధ్యక్షులు నాగమణి, నాగరాజు, రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 8 ఏళ్ల బిజెపి పాలనలో ఆదానీ ఆస్తులు ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానానికి చేరేలా సహాయపడ్డారని అన్నారు. రూ.18 వేల కోట్ల ఎల్ఐసి ఆస్తులను దివాలా తీయించారన్నారు. ప్రజల సొమ్మును ఆదానీకి దోచి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కార్మిక చట్టాల సవరణ చేశారని దుయ్యబట్టారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఖనిజ సంపద ఆధారిత పరిశ్రమలు, ఉపాధి పెంచే మార్గాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సంస్థల ప్రయివేటీకణ ఆపాలన్నారు. హంద్రీనీవాకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి సాగునీరు ఆయకట్టుకు కేటాయించాలన్నారు. డ్రిప్పు స్ప్రింక్లర్లు వంద శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. కౌలు రైతులందరికీ ఎటువంటి షరతులు లేకుండా సిసిఆర్సి ఇచ్చి బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం, పంటల బీమా ఇవ్వాలన్నారు. దేశ రక్షణకు మరో స్వాతంత్ర్యం తరహా పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ కార్మికులు, శ్రామికుల శ్రమను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టి బానిసత్వ జీవితానికి తెచ్చేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, స్కీం వర్కర్‌లకు వేతనాల కోత పెట్టారని, బడ్జెట్ కేటాయింపులు తగ్గించేశారని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు కోడ్‌లుగా పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చేశారని తెలిపారు. పని గంటలు 8 నుంచి 12 గంటలకు మార్చేశారన్నారు. సమ్మె చేసే హక్కును లేకుండా చేశారన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు లేకుండా చేస్తోందన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తోందన్నారు. సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించారన్నారు. ఉపాధి హామీ కూలీలకు సంవత్సరాల తరబడి చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం నియంతృత్వ విధానాలను తిప్పి కొట్టేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఏటీఎం.నాగరాజు, ఎర్రిస్వామి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున, మున్సిపల్ యూనియన్ లక్ష్మిదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిబిసికి సాగునీరు విడుదల

ప్రజాశక్తి-ఉరవకొండ



జిబిసికి నీరు విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

మండల పరిధిలోని నింబగల్లు సమీపంలో ఉన్న గుంతకల్ బ్రాంచ్ కెనాల్ జీరో బై జీరో వద్ద 300 క్యూసెక్కుల సాగునీటిని అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, జిబిసి డిఇ మంజునాథ్ మాట్లాడుతూ విడపనకల్ మండల పరిధిలోని గడేకల్, డోనేకల్, ఎన్.తిమ్మాపురం గ్రామాల రైతులు ఎండుమిరప, జొన్న, పత్తి, కంది తదితర పంటలను సాగు చేశారన్నారు. ఆయా పంటలు చేతికి వచ్చే సమయంలో సాగునీరు సరఫరా ఆగిపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈనేపథ్యంలో రైతు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 15వ తేదీ వరకు సాగునీరు విడుదల చేయాలని కోరడంతో స్పందించిన అధికారులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిబిసి జెఇ పవన్‌కుమార్, వైసిపి నాయకులు రమేష్, హంపయ్య, మేకల చిన్న తిమ్మన్న, మాల్యం తిక్కన్న, సచివాలయ కన్వీనర్లు ప్రతాపరెడ్డి, ఉమాశంకర్, ప్రసాద్, రైతులు గౌరవ భీమలింగ, నారాయణ, మాల్యం చిన్న తిక్కన్న, రామాంజనేయులు, సిద్ధరాముడు, సంఘాల సీనప్ప, గాదిలింగ, బండయ్య, మనోహర్, లక్ష్మీరెడ్డి, చంద్రశేఖర్, ఓబన్న, కిషోర్ రెడ్డి, లాలెప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవో సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం కలెక్టరేట్ : ఎపి ఎన్జీవో నగర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సరం టేబుల్ క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఎన్జీవో హోంలో నిర్వహించిన కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్నగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, ఏపీ ఎన్జీవో సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతాం

కమిషనరేట్ ఎడిఎ పూర్ణ చంద్రరావు



రైతులతో మాట్లాడుతున్న కమిషనరేట్ ఎడిఎ పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రతి రైతునూ శాస్త్రవేత్తగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని కమిషనరేట్ ఎడిఎ పూర్ణచంద్రరావు తెలిపారు. మంగళవారం మండలంలోని పసలూరు కొత్తపల్లి, దయ్యాలకుంటపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న క్లస్టర్ స్థాయి పొలంబడి కార్యక్రమాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రైతులు శివారెడ్డి, సత్యనారాయణరెడ్డి పొలాల్లో సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రైతుల్లో అవగాహన పెంపొందించడంతోపాటు ఆరోగ్యకరమైన పంటను పెంచడమే తమ లక్ష్యమన్నారు. ముఖ్యంగా పంట పొలాల్లో మిత్రపురుగుల ఉత్పతిని కాపాడుకోవటం ద్వారా శత్రుపురుగుల ఉత్పతిని తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, ఆత్మ పీడీ మద్దిలేటి, మండల వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచులు కల్పనా, చిన్నపరెడ్డి, సద్ద రమేష్, ఎంపిటిసి వెంకట శివారెడ్డి, గ్రామరైతులు, రైతుభరోసా కేంద్రాల ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

యోగివేమనకు నివాళి

రాయదుర్గం : మండలంలోని 74–ఉడేగోళం మద్దనేశ్వరస్వామి కళ్యాణ మండపంలో రాయదుర్గం తాలూకా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం యోగివేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విప్ రామచంద్రారెడ్డి, ఎపిఐఐసి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, తదితరులు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం యోగివేమన, హేమరెడ్డి మల్లమ్మ చిత్రపటాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జయశీలారెడ్డి, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు మాధవరెడ్డి, సదాశివరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు రాజగోపాల్‌రెడ్డి, డి.హీరేహాల్ మండల శాఖ అధ్యక్షులు శివరామిరెడ్డి, మండల అధ్యక్షులు నాగరాజురెడ్డి, గుమ్మఘట్ట మండల శాఖ అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, నాగిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అనేకమంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎంపిపి

కుందుర్పి : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపిపి కమల నాగరాజు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపిపి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.8లక్షల వ్యయంతో సిసి రోడ్లు వేయడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మారుతేశ్వరి రామమూర్తి, వైస్ ఎంపిపి శ్రీలక్ష్మీ అజయ్‌బాబు, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, ఎంపిటిసి గంగమ్మ హనుమంతురాయుడు, వార్డ్ మెంబర్లు, ఎంపిడిఒ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

అనంతపురం : స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జనవరి 27, 28, 29వ తేదీల్లో నిర్వహించిన అనంత బాలాల దినోత్సవంలో బహుమతులు సాధించిన విద్యార్థులను మంగళవారం స్థానిక కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ విశ్వనాథ్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులను విద్యతోపాటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇటీవల నిర్వహించిన బాలోత్సవంలో వివిధ విభాగాల్లో విద్యార్థులు బహుమతులు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, కో ఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్లు శ్రీనివాస్‌రెడ్డి, సిరాజుద్దీన్, పిఇటి రవిరాజ్, సింధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతునికి కుటుంబానికి ఆర్థికసాయం

నార్పల : మండల కేంద్రంలోని గారబావి కొట్టాలకు చెందిన బయన్న కుమారుడు అశోక్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఆకుల విజయ్ కుమార్‌బాబు ఆర్థికసాయం అందజేశారు. ముందుగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ మహబూబ్‌బాషా, ఆకుల కిషోర్, మల్లారెడ్డి, అమరేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్


సిఐటియు నాయకులతో చర్చిస్తున్న కార్పొరేషన్ అధికారులు

ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరపాలక సంస్థలోని కమిషనర్ ఛాంబర్‌లో సిఐటియు అనుబంధ సంస్థలు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులతో కమిషనర్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని, హెల్త్ అలవెన్సులు, ఇపిఎఫ్, ఇఎస్ఐలో ఉన్న తప్పొప్పులను సవరించాలని, 35 మందికిపైగా చనిపోయిన కార్మికుల కుటుంబాలకు డెత్ బెనిఫిట్స్ ఇప్పించాలని, సకాలంలో పనిముట్లు, రక్షణ పరికరాలు అందివ్వాలని, పెరిగిన నగర విస్తీర్ణం, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్‌లు అమలు చేయాలనితోపాటు మరిన్ని సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన కమిషనర్ భాగ్యలక్ష్మి ఉన్నతాధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, హెల్త్ ఆఫీసర్ గంగాధర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమోహన్, ప్రజారోగ్య విభాగం అధికారులు రాంప్రసాద్‌రెడ్డి, శేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఉమామహేశ్వరి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాజమోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, నగర ఓల్డ్, న్యూటౌన్ కమిటీ ప్రధాన కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులు శేషేంద్రకుమార్, కోశాధికారి తిరుమలేశు, మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి, నగర కమిటీ సభ్యులు రాఘవేంద్రప్రసాద్, నాగేంద్ర, మరియమ్మ, కృపమ్మ, లక్ష్మీదేవి, ఆదినారాయణ, ఇంజినీరింగ్ కమిటీ సభ్యులు మురళి, మల్లీ, రాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లప్ప, వెంకటేష్, తదితర కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష పాత్ర పోషించిన అధికార పార్టీ కౌన్సిలర్లు

ప్రజాశక్తి-గుంతకల్లు


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవానీ

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ నంగినేని భవానీ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లు ప్రతిపక్ష పాత్ర పోషించారు. పారిశుధ్యం, అభివృద్ధి పనులపై అధికార పక్షానికి చెందిన వైసిపి కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్, కమిషనర్‌ను నిలదీశారు. వివరాల్లోకి వెళ్తే... ముందుగా వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డితో పాటు కౌన్సిలర్లు సుధాకర్, విద్యారాణి, తదితరులు పట్టణంలోని అన్నివార్డుల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. అభివృద్ధి పనులు పనులు నత్త నడక సాగుతున్నాయని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వారితోపాటు ప్రతిపక్ష పార్టీకి చెందిన కౌన్సిలర్లు పవన్‌కుమార్‌గౌడ్, కె.కృపాకర్, షరీఫ్ మాట్లాడుతూ పారిశుధ్యంతోపాటు తాగునీరు, పైపుల లీకేజీ వంటి సమస్యలు వేదిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని వాపోయారు. 9 నెలలుగా ప్రధాన రహదారిలో రోడ్డు వైండింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. దీంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదనపు కార్మికులను నియమించుకుని పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవో 1ని రద్దు చేయాలి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం వాహన రంగంలో త్రైమాసిక పన్నులు విధించేందుకు తీసుకొచ్చిన జీవో ఎంఎస్ 1 రద్దు చేయాలని కారు డ్రైవర్స్ ఓనర్స్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు రామ్ రెడ్డి, నాయకులు వెంకటేష్, రమణ సోమశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్ లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ కరోనా వల్ల రవాణా రంగం పూర్తిగా దెబ్బతినిందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం త్రైమాసిక పన్నులు విధిస్తూ భారాలు మోపడం సరికాదు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్ డ్రైవర్స్ ఓనర్స్ సంఘం నాయకులు సలీం, ఎస్‌కెహెచ్.బాషా, పాంచజన్య పాల్గొన్నారు.

పరిశోధనలతో రైతులు ఆర్థికంగా ఎదగాలి

కిసాన్‌మేళాలో వక్తలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం




మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

పరిశోధనలతోనే రైతులు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎమ్మెల్సీ గోపాల్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వ్యవసాయ సంచాలకులు ఎల్.ప్రశాంతి సూచించారు. కిసాన్ మేళా సందర్భంగా మంగళవారం మండలంలోని రేకలకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమగ్ర వ్యవసాయం, పరిశోధన, యాంత్రీకరణ అనే ప్రధాన అంశాలపైన రైతులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా రైతులకు చిరుధాన్యాలు, వ్యవసాయ పరిశోధనలపై చర్చించి ఆ దిశగా ముందుకు అడుగులు వేసేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే విత్తనాలు, పురుగు మందులు, తెగుళ్ల, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్లు, మిల్లెట్స్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర విషయాలు చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సహదేవరెడ్డి, మండల అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత

ప్రజాశక్తి-అనంతపురం


కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

జగన్ సిఎం అయ్యాక కులమతాలు, పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాప్తాడు మండలంలోని యర్రగుంటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాల లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ తదితర వాటిని గ్రామాల్లోనే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అంతేగాకుండా వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామన్నారు. ప్రతినెలా 1వ తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నారు. ఇకపోతే నియోజకవర్గంలో ప్రతి చెరువుకూ నీళ్లిచ్చామన్నారు. ముఖ్యంగా పేరూరు డ్యాంకు నీరు తెచ్చామన్నారు. దీంతో రైతులు పూర్తిగా సంతృప్తిగా ఉన్నారన్నారు. కావున జగన్‌ను మళ్లీ సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, స్టోర్ డీలర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేకే కుట్రలు

ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌ను ఎదుర్కోలేకే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. మంగళవారం ఉదయం రుద్రంపేట పంచాయతీలో, సాయంత్రం 35వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో ఎక్కడా లేనివిధంగా నాడు నేడు కింద ఆస్పత్రులు, పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామన్నారు. ఇలాంటి తరుణంలో ఓ వర్గం మీడియా రోజుకో అసత్య కథనాన్ని ప్రచురిస్తూ అభివద్ధిని పక్కదోవ పట్టిస్తోందని తెలిపారు. ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతుతో ముందుకు వెళ్తామన్నారు.

సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ఉరవకొండ : వరుసగా మూడో ఏడాది చేతివృత్తుల వారికి జగనన్న తోడు కింద రూ.10వేలు ఖాతాల్లో జమ చేయడాన్ని హర్షిస్తూ మండలంలోని నెరిమెట్ల గ్రామంలో సర్పంచి యోగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ, రజక, దర్జీలు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సిఎం జగన్ తమ అకౌంట్లలో రూ.10 వేలు జమ చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

3న చలో ధర్మస్థలి దీక్షను జయప్రదం చేయండి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప


పోస్టర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 3న కృష్ణా జిల్లాలోని ధర్మస్థలిలో చేపడుతున్న ఒపిఎస్ సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ధర్మస్థలి సంకల్ప దీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవిత భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తానని ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, సీనియర్ నాయకులు మహమ్మద్‌జిలాన్, మండల నాయకులు నాయుడు, కొండప్ప, నాగేంద్ర, శ్రీనివాసులు, నాగభూషణం, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-గార్లదిన్నె


ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న జెసి కేతన్‌గార్గ్

ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించి త్వరతగతిన సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఏడు మండలాల అధికారులతో రీసర్వే, వాటి పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేలో ఫీల్డ్‌లో ఎదురయ్యే సమస్యలపై గ్రామ సర్వేయర్లు, మండల సర్వేయర్లు, డిప్యూటీ తహశీల్దార్‌తో చర్చించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే పైఅధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం తిమ్మంపేట గ్రామంలో చేపట్టిన ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. సర్వే నెంబర్‌లో 95–1లో కౌలు రైతు వేసుకున్న మొక్కజొన్న పంటలో ఈక్రాప్ బుకింగ్ చేస్తుండగా సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహశీల్దార్ ఉషారాణి, వ్యవసాయాధికారి సోమశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి : ఎస్ఐ

నార్పల : వాహనదారులు మండల కేంద్రంలో ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని ఎస్ఐ రాఘవరెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని గూగూడు రోడ్డు, సంత మార్కెట్ రోడ్డు, బస్టాండు కూడలి తదితర ప్రాంతాల్లో పర్యటించి దుకాణాలు, హోటళ్ల ముందు ఉంచిన వాహనాలను తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను ఎక్కువసేపు ఉంచనీయకుండా దుకాణదారులందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గూగూడు రోడ్డు, సంత మార్కెట్ రోడ్డులో వాహనాలను పార్కింగ్ చేయరాదన్నారు. ఇకపై రోడ్డుపై వాహనాలను నిలిపితే అపరాద రుసుం విధిస్తామని హెచ్చరించారు. స్థానికులు కూడా ఎవరైనా వాహనాలను వదిలి వెళితే పోలీస్‌స్టేషన్‌కు సెల్.. 94901 07853కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ ఈశ్వరయ్య, కానిస్టేబుల్ హరి, తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లు ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ కాపు

రాయదుర్గం : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను విప్ కాపు రామచంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.58 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మించారు. ఇందులో కూన నాగప్ప మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్ద, పార్వతీ నగర్ సచివాలయం వద్ద, మల్లాపురం లేఅవుట్, కెబి పిక్చర్ ప్యాలెస్ పక్కన కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్లను విప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, ఉపాధ్యక్షులు వలిబాషా, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డిఒ రామ్మూర్తి, మున్సిపల్ వార్డు సభ్యులు నాగవేణి, శ్రీనివాసరెడ్డి, దేవరాజ్, గోవిందరాజులు, వైసిపి పట్టణ కన్వీనర్ ముస్తాక్, పార్టీ నాయకులు శివ, దివాకర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఒటిపిఆర్ఐ ప్రాంగణ నియామకాల్లో విద్యార్థుల ఎంపిక

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు అనుబంధ ఔషధ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 50 మంది విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన ఒమేగా హెల్త్ కేర్ సంస్థ మెడికల్ కోడింగ్ ఉద్యోగాలకు ఎంపిక కోసం రెండోసారి ఒపిటిఆర్ఐలో ప్రాంగణ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు ఒమేగా హెల్త్‌కేర్ కంపెనీ మానవ వనరుల అభివృద్ధి అధికారి మోహన్‌కుమార్ హాజరై విద్యార్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. 92 మంది విద్యార్థులు హాజరుకాగా 50 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఈకార్యక్రమంలో ఒటిపిఆర్ఐ కళాశాల ప్రిన్సిపాల్ గోపీనాథ్, ప్రాంగణం నియామక కోఆర్డినేటర్ మహేష్, కో–కోఆర్డినేటర్ పవనకుమార్ బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను బీసీ హాస్టల్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ మస్తాన్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. వసతి, తాగునీరు, ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పిస్తున్నారా.. అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని ఆదివారాల్లో పిల్లలు సొంతిళ్లకు వెళ్లకుండా చూడాలన్నారు. హాస్టల్‌లో కనీసం వందమందికి తగ్గకుండా చూడాలని ఆదేశించారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలో 14 బీసీ హాస్టళ్లు ఉన్నాయన్నారు. వీటిల్లో బెలుగుప్ప, బొమ్మనహాల్ మండలాల్లో తక్కువ మంది విద్యార్థులు ఉన్నారన్నారు. కావున వార్డెన్లు విద్యార్థుల సంఖ్య పెంచుకోవాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో డి.హీరేహాల్ బీసీ హాస్టల్ వార్డెన్, బొమ్మనహాల్, కనేకల్ బీసీ హాస్టల్ వార్డెన్ కుళ్లాయిస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

నార్పల : మండల పరిధిలోని హెచ్.సోదనపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ చిరుధాన్యాల ఆరోగ్యానికి అవసరమన్నారు. ఎందుకంటే శరీరానికి అవసరమైన పోషకాలు అందించి ఆరోగ్యకరమైన జీవితానికి దోహదపడతాయన్నారు. అలాంటి చిరుధాన్యాలను సాగు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు చెంగాలరాయుడు, ఆత్మా పీడీ మద్దిలేటి, డిఆర్‌సి సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజాకుమారి, మండల వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ నాగలింగారెడ్డి, జిల్లా సలహామండలి సభ్యులు పెద్దిరెడ్డి, ఎంపిటిసి కాటమయ్య, సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్‌నాయక్, శంకర్‌లాల్‌నాయక్, శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, రుమానాలు బేగం, మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, ఎఇఒ శైలజ, హేమంత్‌కుమార్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య


మృతిచెందిన కాశీం

గుత్తి : ఇష్టం లేని పెళ్లి చేసుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని ఎస్సీ కాలనీ 7వ వార్డులో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన మల్లేష్ కుమారుడు కాశీం(30) పట్టణంలోని అమృత్ టాకీస్ ఎదురుగా ఉన్న కూల్‌డ్రింక్స్ షాప్‌లో పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. అతడికి ఓ గ్రామానికి చెందిన అమ్మాయితో తల్లిదండ్రులు వివాహం నిశ్చయం చేశారు. ఈ క్రమంలో వచ్చేనెల 22, 23వ తేదీల్లో వివాహం కూడా జరగనుంది. ఈనేపథ్యంలో వివాహం ఇష్టం లేక మనస్థాపానికి గురై కాశీం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని కిందికి దింపి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. వ్యక్తి మృతి


మృతిచెందిన పురుషోత్తమరెడ్డి

ఉరవకొండ : ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన విడపనకల్లు మండల పరిధిలోని మాలాపురం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు వెల్పుమడుగు గ్రామానికి చెందిన పురుషోత్తమరెడ్డి (55) పెట్రోల్ బంకులో పెట్రోల్ వేయించుకుని వెళ్తుండగా ఉరవకొండ నుండి బళ్లారికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన పురుషోత్తంరెడ్డిని 108 ద్వారాఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఉద్యానవన వర్శిటీ బోర్డు సభ్యుడు జి.కేశవరెడ్డికి సన్మానం


కేశవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం : వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ బోర్డు మెంబర్‌గా ఎంపికైన రాప్తాడు మండలం హంపాపురం జి.కేశవరెడ్డిని మంగళవారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, సత్యసాయి జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి, ఈకార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త ప్రశాంతి, పరిశోధనకేంద్రం శాస్త్రవేత్తలు సహదేవరెడ్డి, జైలక్ష్మి ప్రసన్న, రాజేష్, పవన్‌కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అనుబంధ అధికారులు, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బెలుగుప్ప : మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని జనసేన, ఎఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాకులు సక్రమంగా అందిస్తున్నారా లేదని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అయితే నాణ్యమైన భోజనం అందించడం లేదని విద్యార్థులు వాపోయారు. ఒక్కోసారి చెడిపోయిన గుడ్లు అందిస్తున్నారని, దుర్వాసన రావడంతో బయటకు పారేస్తామని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి వెంటనే నాణ్యమైన భోజనం అందించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యులు రాజేష్, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు కాసంశెట్టి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే కుష్టువ్యాధి నివారణ

ఉరవకొండ : ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే కుష్టు వ్యాధిని నివారించవచ్చని ఎఎన్ఎం శ్రావణి సూచించారు. కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం విడపనకల్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు, ముఖం, చెవులు, ఎద, వీపు మీద నొప్పి లేని బుడిపెలు రావడం, కనురెప్పలు, కనుబొమ్మలు రాలిపోవుట, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, వాపులు రావడం, ముక్కుదూలం అణిగిపోయి గాలి ఆడకపోవడం, బొటనవేలు, చిటికెన వేలు, మణికట్టు పనిచేయకపోవడం, పాదాలు, చేతులపై బొబ్బలు రావటం తదితరు లక్షణాలు ఉంటే కుష్టు వ్యాధి లక్షణాలుగా గుర్తించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ చాముండి, ఆశా కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ


పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు సచివాలయాన్ని ఎంపిడిఒ యోగానందరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మూమెంట్ రిజిస్టర్ పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటరీలు, సచివాలయ సిబ్బంది సమయానికి విధులకు హాజరై ప్రభుత్వ పథకాలను వివరించడంతోపాటు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా కుటుంబ సభ్యుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటరీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు సన్మానం

రాయదుర్గం రూరల్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంపిడిఒగా అవార్డు అందుకున్న రాయదుర్గం ఎంపిడిఒ టి.కొండయ్యను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిడిఒ కొండయ్య నిత్యం మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించి మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి రఘురామారావు, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కొల్లప్ప, వేణు, భీమేష్, అశోక్, హేమంత్, బసవరాజు, యల్లక్క, తదితరులు పాల్గొన్నారు.

పేద రెడ్ల అభివృద్ధికి కృషి : ఎపి రెడ్డి సంఘం

ఆత్మకూరు : ఆర్థికంగా వెనుకబడిన పేద రెడ్ల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని ఎపి రెడ్డి సంఘం కోశాధికారి పట్నం సురేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్డి సంఘాలు ఎన్ని ఉన్నా ఎపి రెడ్డి సంఘం మాత్రమే పేదల అభివృద్ధికి పారదర్శకంగా పని చేస్తోందన్నారు. ప్రస్తుత సమాజంలో ఎంతోమంది రెడ్లు పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారందరికీ ఎపి రెడ్డిసంఘం బాసటగా నిలుస్తోందన్నారు. కాగా త్వరలో అనంతపురంలో ఎపి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు రేనాటి సింహంగా కీర్తి గడించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గంగులగూడ నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బైరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు విద్యార్థి భాగం ఆర్.నితిన్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు రేనాటి నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎపి రెడ్డి సంఘం నాయకులు